dctelugu.com
# డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 24 శనివారం, అక్టోబర్ 2026




# కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి..

- మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం..
- విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల వద్ద నిఘా
- గంజాయి చాక్లెట్ల విక్రయంపై కఠిన చర్యలు..
- విద్యార్థులు, యువతను అప్రమత్తం చేయా
- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ డీసీ :**

విద్యార్థులు, యువత భవిష్యత్తును మత్తు పదార్థాలు ఛిద్రం చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిరంతర నిఘా, విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసులు, నిర్వహించిన తనిఖీలు, మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు.

### యువత భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ముప్పు

డ్రగ్స్‌కు అలవాటుపడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఆలోచనా శక్తి క్షీణించి, వ్యక్తిగత జీవితం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాల ఆకర్షణకు లోనుకాకుండా విద్యాసంస్థల స్థాయి నుంచే నిరంతర అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరించాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు సమావేశంలో వివరించారు.

### సరఫరాదారులపై నిరంతర నిఘా

డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, విక్రయదారులు, వినియోగదారులను గుర్తించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి మత్తు పదార్థాలు చేరకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### చాక్లెట్ల రూపంలో గంజాయి.. అప్రమత్తంగా ఉండాలి

సాధారణ చాక్లెట్ల ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద బీహార్ కార్మికులకు అందించేందుకు తీసుకొచ్చిన 168 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని వివరించారు. ఈ కేసు వివరాలను కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు తెలియజేశారు. చాక్లెట్ల పేరుతో గంజాయి విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. పిల్లలు, యువతకు తెలియకుండా ఇలాంటి మత్తు పదార్థాలు చేరే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని అధికారులు కోరారు.

### బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్

మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి, వారిని నేరస్థులుగా చూడకుండా అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అడిక్షన్ సెంటర్లు, పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు, ఇప్పటికే వాటికి బానిసైన వారు సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చేలా సహకరించాలని సూచించారు. డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యాన్ని సాధించేందుకు పోలీసు, ఎక్సైజ్, విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేసి, మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.




# వీర్నపల్లి మోడల్ స్కూల్ లో గెస్ట్ టీచర్ పోస్టులు

వీర్నపల్లి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో 6, 7,8 తరగతులకు ఇంగ్లీష్ మీడియంలో సైన్స్ బోధించడానికి హవర్లీ ప్రాతిపదికన ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కె. అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. B.Sc, B.Ed తో పాటు TET ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. (ఇంగ్లీష్ మీడియం బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.). డెమో క్లాస్ ఆధారంగా. అర్హత గల అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో అక్టోబర్ 26, ఉదయం 10:00 గంటలకు మోడల్ స్కూల్‌లో హాజరుకావాలని సూచించారు.

dctelugu.com
డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 24 శనివారం, అక్టోబర్ 2026




# పదో తరగతి పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల!

**కరీంనగర్ డీసీ**

మార్చి-2027లో జరగబోయే ఎస్ఎస్సీ (SSC), ఓఎస్ఎస్సీ (OSSC) మరియు వృత్తి విద్యా పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపుల టైమ్‌టేబుల్‌ను రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ఈ మేరకు కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి (DEO) జల్లి విజయ సాగర్ వివరాలను వెల్లడించా రు.రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఉత్తీర్ణత సాధించని (ఫెయిల్ అయిన) అభ్యర్థులు కూడా సంబంధిత పాఠశాలల హెడ్‌మాస్టర్ల వద్ద నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

**ఫీజు చెల్లింపు గడువు తేదీలు:**

ఆలస్య రుసుము లేకుండా: ఈ నెల 30 నుంచి నవంబర్ 16 వరకు

50 ఫైన్‌తో: నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు

200 ఫైన్‌తో: డిసెంబర్ 3 నుంచి డిసెంబర్ 14 వరకు

500 గరిష్ట ఫైన్‌తో: డిసెంబర్ 16 నుంచి డిసెంబర్ 28 వరకు

# వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**కరీంనగర్ డీసీ**

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం పత్తి కొనుగోళ్లు, జిన్నింగ్ ప్రక్రియను ప్రత్యేక పూజలు నిర్వహించి మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆకుల నర్సన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకుల నర్సన్న మాట్లాడుతూ.. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షించారు. మార్కెట్‌కు పత్తిని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.పత్తి కొనుగోళ్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, సజావుగా సాగాలని, రైతులకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా మార్కెట్ కమిటీ పనిచేస్తుందని, కొనుగోళ్లు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ, పత్తి కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత

- **అర్హులందరికీ న్యాయం చేయడమే లక్ష్యం:**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ డీసీ :**

హుస్నాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా గౌరవెల్లి - గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణలో




భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.